


# ఏడు దశాబ్దాల సినీ చరిత్రకు 'సాక్షి'

**తూ**॥గో॥జిల్లా రాజమండ్రిలో శ్రీసాయికృష్ణ ఎ/సి థియేటర్ ఆంధ్ర రాష్ట్రంలో నిర్మించబడిన రెండవ థియేటర్ అన్న సంగతి కొంతమందికే తెలుసు. మనకు ఇంకా స్వాతంత్ర్యం రాకపూర్వం బ్రిటిష్ వారి పరిపాలన ఉన్న రోజుల్లో అనగా 1924లో ఈ థియేటర్ నిర్మించబడింది. అంటే 2002 సం॥ నాటికి 77 సం॥లు పూర్తిచేసుకుని 78 సం॥లో అడుగుపెట్టింది. అప్పుడు ఈ థియేటర్ పేరు శ్రీకృష్ణా పిక్చర్ ప్యాలెస్‌గా ఉండేది. 1983 నుండి శ్రీసాయికృష్ణా ఎ/సిగా మార్పు చేశారు. ఈ థియేటర్‌కి రాజమండ్రి సిటీలో సెంటర్ థియేటర్‌గా మంచి గుర్తింపు ఉంది. ఏదైనా ఒక చిత్రం విడుదలవుతుందంటే, ఆ చిత్రం ప్రదర్శించబడే థియేటర్‌ని బట్టి కూడా కొంత క్రేజ్ వస్తుంది. అదే విధంగా ఈ థియేటర్‌లో మంచి చిత్రాలు ప్రదర్శించబడతాయని ప్రేక్షకుల్లో మంచి పేరు ఉంది. క్రితం సంవత్సరం విడుదలైన సెన్సేషనల్ హిట్ చిత్రం 'స్టూడెంట్ నెం. 1' ఈ థియేటర్‌లో 150 రోజులు దిగ్విజయంగా ప్రదర్శింపబడింది. గతంలో 100 రోజులు, ఆ పైన ప్రదర్శింపడిన, సిల్వర్ జూబ్లీ జరుపుకున్న చిత్రాలు ఎన్నో ఉన్నాయి. 1924 నుండి 2002 వరకు ఈ థియేటర్‌లో జరిగిన మార్పులు, తదితర విషయాల గురించి ప్రస్తుతం ఈ థియేటర్‌ని ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మురళితో 'నంబర్‌వన్' జరిపిన ఇంటర్వ్యూ.

ఈ థియేటర్ ఎవరు నిర్మించారు? ఎవరిచే ప్రారంభోత్సవం చేయించారు.

**మురళి:** 1924లో మా తాతగారైన నిడమర్తి భగవన్నారాయణగారు, ఆయన సోదరులు అంటే మా చిన తాతలు కృష్ణమూర్తి, సూరయ్యలు ముగ్గురు అన్నదమ్ములు కలిసి నిర్మించారు. మా ముత్తాత కీ॥శే॥ నిడమర్తి జలదుర్గ ప్రసాదరాయుడుగారిచే ఈ థియేటర్ ప్రారంభోత్సవం చేయించారు.

మీ థియేటర్ రాష్ట్రంలోనే నిర్మించిన రెండవ థియేటర్ అంటున్నారు. అసలు మొట్టమొదటి థియేటర్ ఎప్పుడు, ఎక్కడ నిర్మించబడిందో చెబుతారా?

**మురళి:** తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ఈ రెండు రాష్ట్రాలు విడిపోక ముందు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో నిర్మించిన థియేటర్ ఇది. ఒకరకంగా చెప్పాలంటే ఈ రెండు రాష్ట్రాలకు కలిపి నిర్మించిన రెండో థియేటర్ మాది. రాష్ట్రంలో నిర్మించిన మొట్టమొదటి థియేటర్ విజయవాడలోని 'మారుతి' థియేటర్. ఇప్పటికీ ఆ థియేటర్‌కి అదే పేరు ఉంది. మా థియేటర్‌కి రెండు నెలల ముందు ప్రారంభించబడింది. నిర్మాణంలో కొద్ది నెలలో వ్యత్యాసం. కానీ ఒకే సం॥లో ఈ రెండు థియేటర్లు ప్రారంభించబడ్డాయి.

మీ థియేటర్‌లో మొట్టమొదటి చిత్రం ఏది? ఆ తరువాత విషయాల గురించి చెప్పండి?

**మురళి:** ఈ థియేటర్ ప్రారంభించే సమయానికి మూకీ (మూగ) చిత్రాలు మాత్రమే ఉండేవి. 1924 నుండి 1931 వరకు ఈ మూకీ చిత్రాలనే ప్రదర్శించేవారు. ఆ చిత్రాల వివరాలు అంతగా నాకు తెలియవు. ఎందుకంటే అప్పటికి నేను పుట్టలేదు. ఈ విషయాలన్నీ మా నాన్నగారు నిడమర్తి సత్యనారాయణగారి ద్వారా తెలుసుకున్నవే. 1931లో మొట్టమొదటి టాకీ (మాటల) చిత్రం 'ఆలం ఆరా' అనే హిందీ చిత్రాన్ని ప్రదర్శించడం జరిగింది. యావత్ భారత చలనచిత్ర రంగంలో టాకీ యుగానికి నాంది పలికింది ఈ చిత్రమే. అదే సం॥లో మన తెలుగువారు నిర్మించిన తొలి టాకీ చిత్రం 'భక్తప్రహ్లాద' మా థియేటర్‌లో ప్రదర్శింపబడింది. 1932లో 'వీరాభిమన్యు' (హిందీ) అనే చిత్రాన్ని ప్రతి 12 సం॥లకు ఒకసారి వచ్చే గోదావరి పుష్కరాల సమయంలో ప్రదర్శించడం జరిగిందట. ఈ చిత్రం ద్వారానే టాకీ చిత్రాలు అంటే ఏమిటో మంచి ప్రాచుర్యం లభించింది. జనం తండోపతండాలుగా ఎక్కడెక్కడి నుండో ఎడ్లబండ్లపై, కాలినడకన వచ్చి ఈ చిత్రాన్ని చూసేవారట. ఈ మాటల చిత్రాలను చూసి ప్రజలు వింతగా చెప్పుకునేవారట. చుట్టుపక్కల గ్రామాల నుండి ఈ టాకీ చిత్రాలను చూడడానికి వచ్చిన ప్రేక్షకులు, మా థియేటర్‌లో వారు ఈ చిత్రాన్ని చూసినట్లు నిర్ధారణ కోసం థియేటర్ యాజమాన్యం చేత సంతకాలు చేయించుకుని, వాళ్ళ ఊళ్ళో వారికి చూపించి, మేము తెరమీద మాట్లాడే బయోస్కోప్ చూశాం అని గొప్పగా చెప్పుకునేవారట. రాజమండ్రిలో సంవత్సర కాలం ప్రదర్శింపబడిన చిత్రాలలో మొట్టమొదటిది, ఆ తరువాత రెండవది మా థియేటర్‌లోనే ప్రదర్శింపబడ్డాయి. అవి 1948లో 'బాలరాజు' అనే చిత్రం, 1957లో వచ్చిన 'సువర్ణసుందరి' చిత్రం. 'సంపూర్ణ తీర్థయాత్రలు' అనే భక్తిరస చిత్రం ఉదయం ఆటలు 100 రోజులు ప్రదర్శింపబడింది. కేవలం ఉదయం ఆటలు 100 రోజులు ప్రదర్శింపబడడం నేటికీ టౌన్ రికార్డుగానే ఉంది. 'కోహ్రా' అనే హిందీ హారర్ చిత్రం మా థియేటర్‌లో 100 రోజులు ప్రదర్శింపబడి, రాజమండ్రి టౌన్‌లో మొట్టమొదటి 100 రోజులు ప్రదర్శింపబడిన హిందీ చిత్రంగా నమోదైంది. సిటీలో మొట్టమొదట నిర్మించిన థియేటర్ మాది అవడమే కాకుండా, ప్రదర్శించిన చిత్రాల పరంగా సృష్టించిన రికార్డులు మా థియేటర్‌లోనే నెలకొల్పడం మాకెంతో గర్వకారణంగా ఉంది.

కాలానుగుణంగా సాంకేతిక పరమైన మార్పులు ఎప్పుడెప్పుడు, ఏవిధంగా చేసుకుంటూ వచ్చారు?

**మురళి:** 1974 నుండి నేను మేనేజింగ్ పార్టనర్‌గా బాధ్యత తీసుకున్నాను. మా థియేటర్ నిర్మించిన 1924 నుండి 1974 వరకు కూడా సినిమా తెల్లని పెయింట్ వేయబడిన గోడ మీద ప్రొజెక్ట్ చేసేవారు. మొట్టమొదటిసారిగా ఆధునీకరణలో భాగంగా 1974లో పుష్ బ్యాక్ సీట్లు ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే స్క్రీన్ కూడా ఏర్పాటు చేశాం. 1978 వరకు సూపర్ సింప్లెక్స్ విత్ ఫోర్ స్టార్ సౌండ్ సిస్టమ్ ప్రొజెక్టర్ ఉండేది. స్పీకర్స్ అల్‌టెక్ సింగిల్ స్పీకర్స్ ఉండేవి. 1978 తర్వాత 40 వాల్స్ (వెస్టెక్స్) ప్రొజెక్టర్ ఏర్పాటు చేశాం. నేటికీ అదే ప్రొజెక్టర్ రన్ అవుతోంది. 78లో ప్రొజెక్టర్ మార్చినా 1983 వరకు అదే సౌండ్ సిస్ట్ జె.బి.యల్ స్పీకర్స్‌తో డబుల్ హెచ్.ఎఫ్, డబుల్ ఎల్.ఎఫ్‌గా మార్పు చేశాం. అప్పట్లో స్పెషల్ ఎఫెక్ట్‌గా సైడ్ స్పీకర్‌స కూడా ఏర్పాటు చేశాం. అప్పట్లో అది సరికొత్త ప్రయోగం. ఇంజనీర్స్ 60 వాట్ సౌండ్ సిస్టమ్ సరిపోతుందని ప్రిఫర్ చేసినా, ఎఫెక్టివ్‌గా ఉంటుందని, ప్రేక్షకుల అభిరుచిని దృష్టిలో పెట్టుకుని 100 వాట్ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇదే సంవత్సరంలో ఎ/సి థియేటర్‌గా మార్పు చేశాం. రాజమండ్రి టౌన్‌లో మొట్టమొదటి ఎ/సి (ఎయిర్ కూల్డ్) థియేటర్ మాదే. 1924లో అప్పటి నిబంధనలకు అనుగుణంగా థియేటర్ నిర్మాణం జరిగింది. థియేటర్ లోపల ఎన్ని మార్పులు చేసుకున్నా పరవాలేదు. ఇప్పటి నిబంధనల ప్రకారం అవుట్‌సైడ్ స్ట్రక్చర్ మార్పు చేసే అవకాశం లేదు. డి.టి.ఎస్ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చెయ్యాలనే ఆలోచన ఉన్నా, లోపల థియేటర్ వైశాల్యం తక్కువ. ఏర్పాటు చేస్తే స్క్రీన్ ఇంకా ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఈ కారణాల వల్ల ఆలోచనలో ఉన్నాం. 1999 నుండి మా థియేటర్ సురేష్ మూవీస్ ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ (రాజమండ్రి) వారికి లీజ్‌కి ఇవ్వడం జరిగింది.

No-1 2/4/02 - ఎల్.శ్రీనివాసరావు, రాజమండ్రి